బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ సోమవారం , 03 ఆగస్టు-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## ఎదురెక్కుతున్న గోదావరి



## చెరువులో ముంచి చిన్నారి హత్య..



# సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి

- రాహుల్ గాంధీకి కేటీఆర్ లేఖ



హైదరాబాద్, ఆగస్టు 02:
ఇంజినీరింగ్ విద్యార్థులను, ఇంజినీర్లను క్రిమినల్ వేస్ట్ అన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ పార్లమెంట్ పక్ష నాయకులు రాహుల్ గాంధీకి లేఖ రాశారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించాల్సిన నైతిక, రాజకీయ బాధ్యత రాహుల్ గాంధీపై ఉందని లేఖలో గుర్తు చేశారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, నైతికత, యువతకు దక్కాల్సిన గౌరవం వంటి అంశాలపై మాట్లాడే అర్హత రాహుల్ కోల్పోయారని విమర్శించారు. భారతదేశ ఇంజినీర్లు ప్రపంచ కంపెనీలను నడుపుతూ అంతరిక్షంలోకి రాకెట్లను పంపుతూ దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నారని కొనియాడారు. అలాంటి వారిని క్రిమినల్ వేస్ట్ అనడమే కాంగ్రెస్ పార్టీ విధానమా? అంటూ ప్రశ్నించారు. రాహుల్ ఈ అంశంలో మౌనంగా ఉండటమంటే ఆ వ్యాఖ్యలను సమర్థించినట్లేనని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డితో వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. యువతతో మిగతా 3లో..

# ఘనంగా ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి
- కుటుంబ సమేతంగా తొలి బంగారు బోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- భారీగా తరలివచ్చిన భక్తజనం.. ముమ్మర ఏర్పాట్లు చేసిన యంత్రాంగం
- దర్శించుకున్న పలువురు మంత్రులు, రాజకీయ ప్రముఖులు
- జాతరలో ఏర్పాట్లపై జోగినుల ఆవేదన నేటి భవిష్యవాణికి ఏర్పాట్లు పూర్తి



హైదరాబాద్, ఆగస్టు 02:
సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అనసూయ (సీతక్క) అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, ఈవో గుత్తా మనోహర్ రెడ్డి ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో సీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు సీఎం రేవంత్ రెడ్డికి తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం పలికారు. అంతకుముందు ఉదయం 4.05 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారికి తొలి బంగారు బోనంతో పాటు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బోనాల జాతర సందర్భంగా ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, మల్లారెడ్డి, కాలేరు వెంకటేష్, మర్రి రాజశేఖర్ రెడ్డి, శ్రీ గణేష్, మిగతా 3లో..

## ఆగస్టు 16 లోగా ఈ-కేవైసీ తప్పనిసరి..




హైదరాబాద్, ఆగస్టు 02: గత కొన్ని నెలలుగా దేశంలో ఎల్పీజీ సిలిండర్ ధరలు, నిబంధనలలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులు ఆగస్టు 16 లోగా ఈ-కేవైసీని పూర్తి చేయించుకోవాలి. దీనిని పూర్తి చేయకపోతే, గృహ వినియోగ సిలిండర్లపై సబ్సిడీ నిలిపివేయబడుతుంది. సిలిండర్ డెలివరీ కూడా ఆగిపోయే అవకాశం ఉంది. కాబట్టి ఈ-కేవైసీని ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా, గ్యాస్ ఏజెన్సీని సందర్శించడం ద్వారా లేదా డెలివరీ వ్యక్తి సహాయంతో పూర్తి చేసుకోవచ్చు. ఈ నిబంధనలను పాటించని వినియోగదారులకు ఇబ్బందులు తప్పవు.

# మెట్రో కథ మళ్లీ మొదటికి!..

- మొదటి దశ ప్రాజెక్టు టేకోవర్ ఆగమాగం
- గొప్పలకు పోయి, ఇరుక్కున్న సర్కార్
- ప్రత్యామ్నాయ రుణ సేకరణలో ప్రభుత్వం
- అధికారులతో హడావుడిగా సమీక్షలు
- స్వాధీన ప్రక్రియ నిలిచిపోవడంతో రుణభారం
- గుదిబండగా మారిందంటున్న నిపుణులు



హైదరాబాద్, ఆగస్టు 02 : హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ స్వాధీన ప్రక్రియ కథ మళ్లీ మొదటికి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత, దుందుడుకు నిర్ణయాల ఫలితంగా ప్రాజెక్టు ఆగమాగమైంది. సగం ధరకే టేకోవర్ చేసి, చాంపియన్లుగా నిలిచామంటూ రేవంత్ సర్కార్ కొట్టిన గప్పాలు బూమరాంగ్ అయ్యాయి. 'నాలుగు శాతం వడ్డీకే ఐఆర్ఎఫ్‌సీ రుణాన్ని తీసుకొచ్చాము, హైదరాబాద్ మెట్రో ఇక లాభాల్లో పరుగులు పెడుతుంది' అంటూ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేపదే చేసిన ప్రకటనలు ఉత్తవేనని తేలిపోయాయి. ఎల్‌అండ్‌టీని బురిడీ కొట్టించామని చెప్పుకొన్న ప్రభుత్వమే ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. రెండో దశ డీపీఆర్ ఆమోదం దేవుడెరుగు, మొదటి దశ టేకోవర్ ప్రక్రియే మళ్లీ మొదటికి రావడంతో ఏం చేయాలో మిగతా 3లో..

## పాకిస్థాన్‌లో భారీ పేలుడు..



### 9 మంది మృతి

హైదరాబాద్, ఆగస్టు 02: పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరిగిన బాంబు పేలుడులో తొమ్మిది మృతి చెందారు. మరో 20 మందికి గాయాలయ్యాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా స్వాత్ జిల్లాలోని కబాల్ పట్టణంలో వందలాది మంది శాంతి ర్యాలీ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆత్మాహుతి దాడి జరిగినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు ఇంకా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. మిగతా 3లో..

## ఇదిగో కాళేశ్వరం ఎత్తిపోతల నీళ్లు

- ఎల్లంపల్లి నుంచి ఎత్తి పోస్తున్నది కాళేశ్వరం పంపులే
- నంది మేడారం, గాయత్రీ పంపులతోనే మిడ్‌మానేరుకు
- రేవంత్ డైరెక్షన్.. ఉత్తమ్ యాక్షన్.. రాష్ట్ర పాలన ఫ్లాప్
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌కు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏ,బీ,సీ,డీలు తెల్వదు
- కాళేశ్వరంపై కాంగ్రెస్ దుర్నీతిని ఎండగట్టేందుకే నిజనిర్ధారణ యాత్ర
- మాజీ మంత్రులు జీవన్‌రెడ్డి, కొప్పుల, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మిగతా 3లో..

## బీపీఈడీ, యూజీ డీపీఈడీలపై విముఖత

- 1,743 సీట్లకు.. ఆప్షన్లు ఎంచుకున్నవారు 1,400 మందే

హైదరాబాద్, ఆగస్టు 02 : బీపీఈడీ, యూజీ డీపీఈడీ కోర్సుల్లో సీట్ల భర్తీకి నిర్వహించిన ఫిజికల్ ఎడ్యుకేషన్ వెబ్ కౌన్సెలింగ్ మొదటి విడుత సీట్లను ఆదివారం కేటాయించారు. 1,743 సీట్లు ఉంటే కేవలం 1,400 మంది మాత్రమే వెబ్ ఆప్షన్లు ఎంచుకోగా, 1,106 మంది మాత్రమే సీట్లు దక్కించుకున్నారు. కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. మొదటి విడుత సీట్ల కేటాయింపు తర్వాత 637 సీట్లు మిగిలాయి. సీట్లు పొం దిన వారు ఈనెల 6లోపు సీట్లు వచ్చిన కాలే జీల్లో రిపోర్ట్ చేయాలని ప్రవేశాల కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ పొందురంగారెడ్డి ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు. ): తెలం గాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (టీజీసీజీటీఏ) నూతన కార్య వర్గాన్ని ఆది వారం ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. అధ్యక్షుడిగా కే సురేందర్‌రెడ్డి, అసోసి యేట్ అధ్యక్షుడిగా జే చిన్న, ఉపాధ్యక్షుడిగా కే తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి బీ యాద య్య, ఆర్థిక కార్యదర్శిగా ఎన్ రమేశ్, మహిళా కార్యదర్శిగా సీహెచ్ జ్యోత్స్న, కార్యవర్గ సభ్య లుగా పావని, కిరణ్‌కుమార్, మల్టీజోన్-1 కార్యదర్శిగా యూ రవికుమార్, మల్టీజోన్-2 కార్యదర్శిగా పీనర్సింహులును ఎన్నుకున్నారు.

# బహదూర్‌గూడలో రైతుల దీక్ష భగ్నం



- దీక్షలు చేస్తే చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక
- హెచ్చరికలను బేఖాతర్ దీక్ష కొనసాగిస్తున్న రైతులు

హైదరాబాద్, ఆగస్టు 02 : శంషాబాద్ మండలం బహదూర్‌గూడ గ్రామంలో బుల్లెట్‌ట్రైన్ ప్రాజెక్టు ఏర్పాటుకు రైతులు 650 భూములు ఇవ్వడానికి నిరాకరించడంతో పోలీసులు వారిపై కేసులు నమోదు చేసి, వారి భూముల్లో అధికారులు బలవంతంగా ఫెన్సింగ్ వేసిన విషయం విదితమే. అయితే రైతులు ప్రభుత్వ చర్యను నిరసిస్తూ గత మూడు రోజులుగా నుంచి నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం శంషాబాద్ సీఐ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా పోలీసులు బహదూర్‌గూడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రైతుల నిరాహార దీక్షను భగ్నం చేసేందుకు యత్నించడంతోపాటు, మిగతా 3లో..

## నిరుద్యోగులను వంచించిన కాంగ్రెస్



- 'జాబ్ క్యాలెండర్' ఆశచూపి గద్దెనెక్కి మోసం.. నోటిఫికేషన్లు రాక తీవ్ర నిరాశలో నిరుద్యోగులు
- అభ్యర్థులెవరూ అధైర్యపడొద్దు.. బీఆర్ఎస్ తోడుగా ఉంటుంది
- మాజీ మంత్రి అజయ్, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎంపీ నామా
- ఖమ్మంలో వేణుకుమార్‌కు పరామర్శ

ఖమ్మం కమాన్‌బజార్, ఆగస్టు 2: జాబ్ క్యాలెండర్ పేరుతో హామీ ఇచ్చి రాష్ట్రంలోని నిరుద్యోగులు, ఉద్యోగార్థులను కాంగ్రెస్ నిలువునా మోసం చేసిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. ఉద్యోగాల పేరుతో వంచించడం, హామీలను ఎగవేయడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారని ఆందోళన వ్యక్తంచేశారు. జాబ్ క్యాలెండర్ అమలు చేయకపోవడంతో మనస్తాపం చెందిన ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం మిగతా 3లో..

## భారీ వర్షాలు..9 జిల్లాల్లో స్కూళ్లకు సెలవు



హైదరాబాద్, ఆగస్టు 02:
కేరళంలో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఆదివారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ నేపథ్యంలో, సోమవారం (ఆగస్టు 3) రాష్ట్రంలోని 9 జిల్లాల్లోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ జిల్లా యంత్రాంగాలు ఉత్తర్వులు జారీ చేశాయి. కాసరగోడ్, కన్నూర్, కోజికోడ్, వయనాడ్, మలప్పురం, త్రిసూర్, ఇడుక్కి, కొట్టాయం, పత్తనంతిట్ట జిల్లాల్లోని అన్ని విద్యాసంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు. అలప్పుళ జిల్లాలో ప్రస్తుతం సహాయక శిబిరాలుగా కొనసాగుతున్న పాఠశాలలు, కళాశాలలకు సెలవు ఇచ్చారు.అదేవిధంగా, వరద ప్రభావిత ప్రాంతాలైన చెంగన్నూర్, కుట్టనాడ్ తాలూకాల్లోని పాఠశాలలు, కళాశాలలు, వృత్తి విద్యా సంస్థలు (ప్రొఫెషనల్ కాలేజీలు), అంగన్‌వాడీలు, మిగతా 3లో..

# టామ్ హాలండ్ 'స్పైడర్-మ్యాన్' దూకుడు..



● మూడు రోజుల్లో

రూ.215 కోట్ల వసూళ్లు...

బలగం టీవీ, హైదరాబాద్:
హాలీవుడ్ సూపర్ హీరో చిత్రం 'స్పైడర్-మ్యాన్: బ్రాండ్ న్యూ డే' భారత బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. టామ్ హాలండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం విడుదలైన మూడు రోజుల్లోనే రూ.215.47 కోట్ల గ్రాస్ వసూలు చేసి రూ.200 కోట్ల క్లబ్‌లోకి చేరింది. దర్శకుడు డెస్టిన్ డేనియల్ క్రెటన్ తెరకెక్కించిన ఈ చిత్రం భారత్‌లో గురువారం ఇంగ్లీష్‌తో పాటు హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో 2డీ, 3డీ ఫార్మాట్లలో విడుదలైంది. ప్రపంచవ్యాప్త విడుదలకు ఒక రోజు ముందే భారత ప్రేక్షకుల ముందుకు రావడం విశేషం. ట్రేడ్ ట్రాకింగ్ వెబ్‌సైట్ సాక్‌నిల్క్ వివరాల ప్రకారం, విడుదలైన తొలి రోజే ఈ సినిమా రూ.72.44 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. అనంతరం కూడా అదే జోరును కొనసాగిస్తూ మూడు రోజుల్లో మొత్తం రూ.215.47 కోట్ల గ్రాస్ సాధించింది. ఈ చిత్రంలో టామ్ హాలండ్ మరోసారి పీటర్ పార్కర్/స్పైడర్-మ్యాన్ పాత్రలో నటించగా, జెండయా, జేకబ్ బటాలన్, సేడీ సింక్ కీలక పాత్రలు పోషించారు. 'నో వే హోమ్' (2021) ఘటనల తర్వాత నాలుగేళ్లకు సాగే కథలో, తనను ప్రేమించిన వారందరి జ్ఞాపకాల నుంచి తానే తనను తొలగించుకున్న పీటర్ పార్కర్ ఒంటరి జీవితాన్ని గడుపుతుంటాడు. అదే సమయంలో కొత్త శక్తివంతమైన శత్రువును ఎదుర్కొంటూ, తన సూపర్ హీరో జీవితంలో చోటుచేసుకునే అనూహ్య మార్పులతో పోరాడే కథాంశంతో ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తోంది.

# ఇంజనీరింగ్ విద్యార్థులపై వ్యాఖ్యలు..

● క్షమాపణ చెప్పాలని

కేటీఆర్ డిమాండ్...



బలగం టీవీ, హైదరాబాద్:
ఇంజనీరింగ్ విద్యార్థులపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. యువతే రేపటి దేశ నిర్మాతలని, ఇంజనీరింగ్ విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలు వారిని అవమానించేలా ఉన్నాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. ఈ అంశంపై స్పందించడం రాహుల్ గాంధీకి నైతికంగా, రాజకీయంగా బాధ్యత అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ ఈ వివాదంపై మౌనం పాటిస్తే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను సమర్థించినట్లే భావించాల్సి వస్తుందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు ఇంజనీరింగ్ అధ్యాపకులపైనా రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించిన కేటీఆర్, ఆ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఇద్దరూ విద్యార్థులు, అధ్యాపకులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ లేఖతో ఇంజనీరింగ్ విద్యార్థులపై జరిగిన వ్యాఖ్యల అంశం రాష్ట్ర రాజకీయాల్లోమరోసారిచర్చనీయాంశంగా మారింది.


# పట్నం రుక్కమ్మ చిత్రపటానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళి



బలగం టీవీ హైదరాబాద్:
తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి శ్రీమతి పట్నం రుక్కమ్మ చిత్రపటానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. ఇటీవల మరణించిన రుక్కమ్మ గారి దశదిన కర్మ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి, ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.
అనంతరం పట్నం మహేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ముఖ్యమంత్రి, వారికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, రుక్కమ్మ గారి సేవలను స్మరించుకున్నారు.

# కాంగ్రెస్ పాలనలో అందని సర్కార్ వైద్యం..

● గండ్ర వెంకటరమణరెడ్డి ఆగ్రహం
● భూపాలపల్లి దవాఖానలో అధ్వానంగా మరుగుదొడ్లు
● 9 నెలలుగా తాగునీరులేక అవస్థలు



జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 2 : గత బీఆర్ఎస్ పాలనలో రోగులకు వరంగా ఉన్న భూపాలపల్లిలోని ప్రభుత్వ దవాఖాన కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తంగా మారిందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మండిపడ్డారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ దవాఖానను స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులు రమణారెడ్డి వద్దకొచ్చి దవాఖానలోని సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మీడియాతో మాట్లాడుతూ.. భూపాలపల్లి జిల్లా ప్రజలతో పాటు, సమీపంలోని ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి ఇక్కడికి వచ్చే రోగులకు అత్యవసర వైద్య సేవలందించాల్సిన జిల్లా జనరల్ దవాఖాన నేడు సమస్యలకు నిలయంగా మారిందని మండిపడ్డారు.

# సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్







బలగం టీవీ, హైదరాబాద్:
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల పండుగ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి కేటీఆర్‌కు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆయన అమ్మవారి ఆశీస్సులు తీసుకుని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, తెలంగాణ సుభిక్షంగా అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. బోనాల మహోత్సవాల సందర్భంగా ఆలయానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తుల మధ్య భక్తిశ్రద్ధల నడుమ కేటీఆర్ అమ్మవారిని దర్శించుకోవడం విశేషంగా నిలిచింది.
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.

## రూ.6 లక్షలతో ముదిరాజ్ సంఘ భవనం..

# ఘనంగా భూమిపూజ...



బలగం టీవీ, వేములవాడ:
వేములవాడ పట్టణంలోని ముదిరాజ్ మత్స్యకారుల సంఘం నూతన భవన నిర్మాణానికి ఆదివారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. సుమారు రూ.6 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ భవనానికి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. నిర్వహించిన సమావేశంలో పుల్కం రాజు మాట్లాడుతూ, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకత్వంలో వేములవాడలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పట్టణంలోని 54 కుల సంఘాలకు ఒక్కో భవన నిర్మాణానికి రూ.6 లక్షల చొప్పున నిధులు కేటాయించి పనులు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. కుల సంఘాల భవనాలు ఆయా సంఘాల సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు, పండుగలు, శుభకార్యాలు నిర్వహించేందుకు, సంఘానికి చెందిన సామగ్రిని భద్రపరచేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడంలో ఈ భవనాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పట్టణాభివృద్ధిపై సోషల్ మీడియాలో కొందరు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, అలాంటి రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని పుల్కం రాజు వ్యాఖ్యానించారు. వేములవాడ సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, అభివృద్ధి పనులే తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తుం మధు, కౌన్సిలర్లు తోట రాజు, కొండ రాజశేఖర్, ముదిరాజ్ మత్స్యకార సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఎదురెక్కుతున్న గోదావరి

కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఎస్సారెస్పీ వైపు జలాల పరుగు



హైదరాబాద్, ఆగస్టు 02: ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా గోదావరి జలాలు ఎస్సారెస్పీ వైపు ఎదురెక్కుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2 పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలోని నంది, కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌తోపాటు, పునర్జీవ పథకం ద్వారా జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్, మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌస్‌లో ఆదివారం ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. నంది పంప్‌హౌస్‌లో ఒక్కో మోటర్ ద్వారా 3,150 క్యూసెకుల చొప్పున మొత్తం ఐదు పంపుల ద్వారా 15,750 క్యూసెకుల ప్రవాహంతో నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి అదే జంట సొరంగాల ద్వారా గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిస్తున్నారు. అక్కడి 1, 2, 3, 4, 7వ మోటర్లతో ఒక్కో మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున 15,750 క్యూసెక్కుల ప్రవాహంతో ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి అప్రోచ్ కెనాల్ ద్వారా వరద కాలువకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి వరద కాలువ ద్వారా ఎడమ వైపు శ్రీరాజరాజేశ్వర (మిడ్‌మానేరు) జలాశయానికి 9,950 క్యూసెక్కులు, పునర్జీవ పథకం ద్వారా కుడివైపు రాంపూర్ పంప్‌హౌస్‌కు 5,800 క్యూసెక్కుల ప్రవాహంతో పంపిస్తున్నారు. అక్కడ నాలుగు మోటర్ల ద్వారా అంతే మొత్తంలో ఎత్తిపోస్తుండగా, రాజేశ్వర్‌రావుపేట (వరద కాలువ 34వ కిలోమీటర్) వద్ద నిర్మించిన పంప్‌హౌస్‌కు గోదావరి జలాలు చేరుకున్నాయి. అక్కడ మూడు పంపులు ఆన్‌చేసి ఒక్కో పంప్ ద్వారా 1,450 క్యూసెక్కుల చొప్పున 4,350 క్యూసెక్కుల ప్రవాహంతో ఎగువకు ఎత్తిపోస్తున్నారు.

# ఫారెస్ట్ అధికారుల తీరుపై ఆగ్రహం



ఇందన్‌పెల్లిలో రాస్తారోకో

జన్నారం, ఆగస్టు 2 : మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందన్‌పెల్లిలోని వాగుకు చేపలు పట్టడానికి వెళ్లిన ఐదుగురు ఆదివాసీ యువకులను ఫారెస్ట్ అధికారులు కొట్టితీసుకెళ్లడంపై గిరిజనులు ఆదివారం ఇందన్‌పెల్లి ప్రధానరోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. వారిని వదిలిపెట్టకపోవడంపై మండిపడ్డారు. అటవీశాఖ అధికారుల దాడులతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి ఘటనలు జరుగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# చెరువులో ముంచి చిన్నారి హత్య..



మద్యం మత్తులో తల్లి ఘాతుకం

మన్సూరాబాద్, ఆగస్టు 2: మద్యం మత్తులో ఉన్న ఓ తల్లి 9 నెలల తన కుమార్తెను చెరువులో ముంచి హత్యచేసిన ఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వినోద్‌కుమార్ కథనం ప్రకారం కర్ణాటక రాష్ట్రం, బీదర్ జిల్లాకు చెందిన రవీందర్‌రెడ్డి, లోకసాని రాజేశ్వరి(34) భార్యాభర్తలు. వీరికి కుమార్తె లోకసాని అనూరాధ ఉంది. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా రాజేశ్వరి ప్రస్తుతం భర్తకు దూరంగా ఉంటున్నట్టు సమాచారం. ఆదివారం మద్యం తాగిన రాజేశ్వరి సాయంత్రం 6:30 గంటల సమయంలో చిన్నారితో కలిసి ఎల్బీనగర్, సాగర్ రింగ్‌రోడ్డు సమీపంలోని బైరామల్‌గూడ చెరువు వద్దకు వచ్చి, చిన్నారి అనూరాధను చెరువులో ముంచింది. కొద్దిదూరంలో ఉన్న యువకులు దీన్ని గమనించి పరుగెత్తుకొచ్చి చిన్నారిని బయటకు తీశారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్టు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎల్బీనగర్ పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి రాజేశ్వరిని అదుపులోకి తీసుకుని, మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. చిన్నారిని చంపిన సమయంలో తల్లి మద్యం మత్తులో ఉన్నట్టు ఎస్సై తెలిపారు. కాగా భర్తతో దూరంగా ఉంటున్న రాజేశ్వరి మరోవ్యక్తితో సన్నిహితంగా ఉంటున్నట్టు సమాచారం. అతడితో గొడవ కారణంగానే చిన్నారిని హత్య చేసి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# 'పెద్ది' త్యాగాలు అజరామరం

● దేవాదుల ప్రాజెక్టుకు సుదర్శన్‌రెడ్డి పేరు పెట్టాలి
● మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్
● ఆటా మహాసభల్లో పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఘన నివాళులు



హైదరాబాద్, ఆగస్టు 02: మలిదశ ఉద్యమంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి త్యాగాలు అజరామరం అని మాజీ మంత్రులు సీ లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. అమెరికాలోని బాల్టిమోర్ వేదికగా జరుగుతున్న 19వ ఆటా మహాసభల్లో ఉద్యమ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఆదివారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఉద్యమంలో తీవ్ర గాయాలపాలైనా లెకచేయకుండా చివరి వరకు తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం పెద్ది నిరంతరం శ్రమించాడని గుర్తుచేసుకున్నారు. అలాంటి మహనీయుడిని కోల్పోవడం తెలంగాణ సమాజానికి, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యూఎస్ఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ సంతాప సభకు ప్రవాస భారతీయులు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది తమ ప్రియతమ నాయకుడు పెద్దిని స్మరించుకున్నారు. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యూఎస్ఏ ఇన్‌చార్జి మహేశ్ తన్నీరు మాట్లాడుతూ.. పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలకు గుర్తింపుగా తెలంగాణ తాగు, సాగునీటి రంగంలో కీలకమైన దేవాదుల ప్రాజెక్టుతోపాటు నర్సంపేటలో ఏర్పాటుకానున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సుదర్శన్‌రెడ్డి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్ఆర్ఐలు తిరుపతిరెడ్డి ఎర్రంరెడ్డి, చందు తాళ్ల, నరసింహ నాగులవంచ, రజినీకాంత్ కొసనం పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ రాజేందర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, పుట్ట మధు, సీనియర్ నాయకులు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కర్నాటి విద్యాసాగర్, కంచర్ల కృష్ణారెడ్డి, నంద్యాల దయాకర్‌రెడ్డి, రఘువీర్‌సింగ్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

## (మొదటిపేజీ తరువాయి)

## ఘనంగా ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర



నవీన్ యాదవ్, సాంస్కృతిక సారథి చైర్మెన్ వెన్నెల, సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దీపక్ జాన్, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ, సీపీ సజ్జనార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అమెరికా కాన్సుల్ జనరల్ లారా ఈ.విలియమ్స్, హీరోయిన్ వైష్ణవి అమ్మవారికి బోనం సమర్పించి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాంగం సకల ఏర్పాట్లు చేసింది. దేవాలయ చైర్మెన్ రామేశ్వర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, ఈవో మనోహర్ రెడ్డితో పాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ఎస్‌బీ, మెడికల్, ఫైర్, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఆలయ పరిసరాల్లో ఉచిత వైద్య శిబిరాలు, మంచినీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకున్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎ లాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి

పెట్టుకుంటే ఏమైందో రాహుల్ గాంధీ నానమ్మ ఇందిరమ్మకు ఎమర్జెన్సీ సమయంలో, తెలంగాణ ఉద్యమ సమయంలో యూపీఏకు తెలుసని ప్రస్తావించారు. యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యమేననే విషయం గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ యువతను మభ్యపెట్టిన రాహుల్ గాంధీకి తన నైతిక బాధ్యతను గుర్తు చేయడానికే ఈ లేఖ రాస్తున్నానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హామీల పేరుతో మోసపోయిన యువత సరైన సమయంలో తగిన సమాధానం చెబుతుందని కేటీఆర్ హెచ్చరించారు.

## భారీ వర్షాలు..9 జిల్లాల్లో స్కూళ్లకు సెలవు



ట్యూషన్ సెంటర్లకు కూడా సెలవు ప్రకటించారు. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రాష్ట్రంలోని మొత్తం 14 జిల్లాలకు సోమవారం 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. దీని ప్రకారం, రాబోయే 24 గంటల్లో కొన్ని చోట్ల 7 నుంచి 11 సెంటీమీటర్ల మేర భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

## నిరుద్యోగులను వంచించిన కాంగ్రెస్



రైతులు ఏర్పాటు చేసుకొన్న ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బందితో తొలగించారు. గ్రామంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నదని, ఇక్కడ దీక్షలు చేయడానికి ఎలాంటి అనుమతి లేదని, ఎవరైనా దీక్షలు చేసే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, పోలీసుల హెచ్చరికలను బేఖాతర్ చేస్తూ రైతుల అక్కడే దీక్షలకు మళ్లీ పూనుకొని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురానికి చెందిన గడ్డం వేణుకుమార్ శనివారం ఆత్మహత్యకు యత్నించిన విషయం విదితమే. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న అతడిని మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ తాతా మధు, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు తదితరులు ఆదివారం పరామర్శించారు. అధైర్య పడవద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని బాధితుడికి ధైర్యం చెప్పారు. అతడి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగుల ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ముచేయడం దారుణమని పువ్వాడ అజయ్ విమర్శించారు. నిరుద్యోగుల సమస్యల పరిషారం కోసం బీఆర్ఎస్ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలతోపాటు నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేయడం వల్లనే గ్రూప్స్ ఉద్యోగార్థి వేణుకుమార్ ఆత్మహత్యాయత్నం చేశాడని ఎమ్మెల్సీ తాతా మధు, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు పేర్కొన్నారు. సూసైడ్ నోట్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చేరేలా సోషల్ మీడియాలో షేర్ చేయాలని కోరడం ప్రజలందరినీ కలచివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. అతడి తల్లి మానసిక దివ్యాంగురాలని, తండ్రి గీత కార్మికుడని, సొంత ఇల్లు కూడా లేదని, పదేండ్లుగా అద్దె ఇంట్లోనే ఉంటున్నారని పేర్కొన్నారు. అతడి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకపోవడానికి కొలమానం ఏమిటో చెప్పాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ప్రశ్నించారు. వేణు ఆవేదన మీడియా, ప్రజల దృష్టికి వెళ్లకుండా ప్రభుత్వం పోలీసు బందోబస్తుతో అడ్డుకుంటున్నదని ఆరోపించారు.

## మెట్రో కథ మళ్లీ మొదటికి!..

అర్థంకాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రుణం వచ్చే దారులు కనిపించకపోవడం, ప్రభుత్వ ఖజానా నుంచి ఏకంగా రూ.1,440 కోట్లు ఎల్ అండ్ టీ ఖాతాలోకి చేరడం, ఎల్ అండ్ టీ రుణంపై వడ్డీ కట్టాల్సి రావడంతో రేవంత్ సర్కార్ కక్కలేక మింగలేక తంటాలు పడుతున్నది. గ్రేటర్ ఎన్నికల ముందు మెట్రో రెండో దశ పేరుతో హడావుడి చేయాలనుకున్న అధికార పార్టీకి పాలనాపరంగా, రాజకీయంగా సంకట పరిస్థితులు నెలకొన్నాయి. రూ.43 వేల కోట్ల అంచనాలతో మెట్రో రెండో దశ విస్తరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ప్రాజెక్టులకు అనుమతులు వస్తాయని భావించి, మెట్రో ఫేజ్-1ను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 29న ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. సంస్థకున్న రూ.13,600 కోట్ల భారీ రుణాన్ని ప్రభుత్వం పేరిట బదిలీ చేయించుకున్నది. దీనిని చెల్లించేందుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) ద్వారా తక్కువ వడ్డీకే రుణం సేకరిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది.ప్రభుత్వానికి ఐఆర్ఎఫ్‌సీ నుంచి రుణం రాకుండానే, రూ.1440 కోట్ల ఈక్విటీని ఎల్ అండ్ టీ నుంచి సర్కార్ బదిలీ చేసుకున్నది. అంతేకాదు ప్రాసెస్ ఫీజుల కింద రూ.84.32 కోట్లను ఐఆర్ఎఫ్‌సీకి చెల్లించింది. గడువు కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేసినా కేంద్రం ఆడిన చదరంగంలో రేవంత్ పావులా మారిపోయారు. మెట్రో ద్వారా వచ్చే రాబడిలో ముందుగా నిర్వహణ ఖర్చులు చెల్లించాలని కేంద్రం స్పష్టం చేయగా, ఐఆర్ఎఫ్‌సీ రుణానికే మొదటి ప్రాధాన్యత ఇస్తామని ప్రభుత్వం అంగీకరించడం పెద్ద చిక్కుముడిగా మారింది. ఫలితంగా ఐఆర్ఎఫ్‌సీ నుంచి రుణం ఆగిపోయింది. ఇప్పుడు ప్రత్యామ్నా య రుణం కోసం ప్రభుత్వం బ్యాంకుల చుట్టూ తిరిగే దుస్థితి దాపురించింది.

# ఇదిగో కాళేశ్వరం ఎత్తిపోతల నీళ్లు

- ఎల్లంపల్లి నుంచి ఎత్తి పోస్తున్నది కాళేశ్వరం పంపులే
- నంది మేడారం, గాయత్రీ పంపులతోనే మిడ్‌మానేరుకు
- రేవంత్ డైరెక్షన్.. ఉత్తమ్ యాక్షన్.. రాష్ట్ర పాలన ఫ్లాప్
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌కు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏ,బీ,సీ,డీలు తెల్వదు
- కాళేశ్వరంపై కాంగ్రెస్ దుర్నీతిని ఎండగట్టేందుకే నిజనిర్ధారణ యాత్ర
- మాజీ మంత్రులు జీవన్‌రెడ్డి, కొప్పుల, మాజీ ఎంపీ వినోద్‌కుమార్
- గాయత్రీ పంప్‌హౌస్‌ను సందర్శించిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం



హైదరాబాద్, ఆగస్టు 02 : కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కాళేశ్వరం గుడి కాదని, మేడిగడ్డ బరాజ్‌కు చెందిన రెండు పిల్లర్లు కాదని, కాళేశ్వరం అంటే.. ఒక బహుళార్ధ సాధక ప్రాజెక్టు అని, తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడంతోపాటు ప్రజలందరికి అమృతధారను అందించే అద్భుత నిర్మాణమని బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం అభివర్ణించింది. కాళేశ్వరం కూలిపోలేదని, అది రాష్ట్ర జలజీవధారగా నిలిచిందనడానికి కోటిలింగాల వద్ద నిలిచి ఉన్న బ్యాక్‌వాటర్, నంది మేడారం, రామడుగు మండలం గాయత్రీ పంప్‌హౌస్‌ల నుంచి ఉబికి వస్తున్న గోదావరి జలాలే అందుకు సాక్ష్యమని స్పష్టంచేసింది. నిన్నామొన్నటి వరకు కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని, నీరు ఎత్తిపోసే పరిస్థితి లేదని చెప్తూ వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగంగా ఏర్పాటు చేసిన నంది, గాయత్రీ పంప్‌హౌస్‌లను ప్రారంభించి నీటిని మిడ్‌మానేరులోకి, ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా ఎగువ వరద కాలువల్లోకి తరలిస్తున్న విషయాన్ని తెలంగాణ ప్రజలకు మరోసారి తెలియజేయడంతోపాటు, సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన భజన బృందానికి కనువిప్పు కలిగించేందుకు బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది.

## ఇందూరును ముద్దాడిన కాళేశ్వరం జలాలు



- రాజేశ్వర్‌రావుపేట్ వద్ద మూడు పంపులతో ఎత్తిపోత
- కేసీఆర్, ఎమ్మెల్యే వేముల చిత్రపటాలకు క్షీరాభిషేకం

హైదరాబాద్, ఆగస్టు 02 : కాళేశ్వరం జలాలు నిజామాబాద్ జిల్లాను మరోమారు ముద్దాడాయి. ఆదివారం ఉదయం 7 గంటలకు జిల్లా సరిహద్దులోని కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ శివారులోని క్రాస్‌రెగ్యులేటర్ గేట్లను అధికారులు ఎత్తడంతో కాళేశ్వరం జలాలు జిల్లాలోకి అడుగుపెట్టాయి. వరదకాలువ 73వ కిలోమీటర్ వద్ద రాంపూర్ పంప్‌హౌస్ వద్ద నాలుగు మోటర్లను ఆన్‌చేసి నాలుగు పంపుల ద్వారా వరదకాలువలోని నీటిని విడుదల చేయడంతో 34 కిలోమీటర్ల దూరంలోని రాజేశ్వర్‌రావుపేట్ పంప్‌హౌస్‌కు కాళేశ్వరం జలాలు చేరుకున్నాయి. వరద కాలువకు కాళేశ్వరం జలాలను ఎత్తిపోయడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమైంది. ఇక తమ పంటలకు ఢోకా లేదన్న ధీమాను వ్యక్తంచేస్తున్నారు. కాగా కమ్మర్‌పల్లి-మోర్తాడ్ సరిహద్దులోని తిమ్మాపూర్ బైపాస్‌రోడ్డు సమీపంలో వరద కాలువ బ్రిడ్జి వద్ద రివర్స్‌పంపింగ్ ద్వారా నీరు ఎదురెక్కి పారుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. వరదకాలువలో ఎదురెక్కి వస్తున్న కాళేశ్వరం జలాలపై బీఆర్ఎస్ నాయకులు, రైతులు పూలు చల్లిస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమ్మర్‌పల్లి శివారులో వరదకాలువపై కేసీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలకు కమ్మర్‌పల్లి, మోర్తాడ్, వేల్పూర్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

## వీసా బాండ్ కొనసాగించనున్న అమెరికా

- గరిష్ఠ బాండ్ పరిమితిని 20 వేల డాలర్లకు పెంపు
- బాండ్ పరిధిలో భారత్ లేకపోవడంతో ఊరట

వాషింగ్టన్,ఆగస్ట్1 : గతంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన వీసా బాండ్ విధానాన్ని కొనసాగించేందుకు అమెరికా విదేశాంగ శాఖ నిర్ణయించింది. శాశ్వత ప్రాతిపదికన ఈ విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణయించింది. గతంలో నిర్వహించిన పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో అమెరికా విదేశాంగ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. విజిటర్ వీసాల కోసం దరఖాస్తు చేసుకునే వారు ముందుగా 15 వేల డాలర్ల వరకూ బాండ్ సమర్పించాలంటూ ఏడాది క్రితం అమెరికా ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని తీసుకొచ్చింది. బీ-1 (బిజినెస్), బీ-2 (టూరిస్ట్) వీసాలకు దరఖాస్తు చేసుకునే వారు ఈ బాండ్ సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు ఈ బాండ్ సమర్పించాలా? వాద్దా? అనేది కాన్సులార్ ఆఫీసర్లు నిర్ణయిస్తారు. వీసా గడువులోపు విదేశీయులు అమెరికాను వీడితే ఈ మొత్తాన్ని తిరిగిచ్చేస్తారు. లేకపోతే డబ్బును కోల్పోవాల్సి ఉంటుంది. అక్రమ వలసలను నిరోధించేందుకు అమెరికా ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా దరఖాస్తుదారులు 5 వేలు, 10 వేలు లేదా 15 వేల డాలర్ల బాండ్స్‌ను సమర్పించేవారు. ప్రస్తుతం అమలు చేయనున్న విధానంలో మాత్రం 5 వేల బాండ్ ఆప్షన్‌ను అమెరికా తొలగించింది. అంతేకాకుండా, గరిష్ఠ బాండ్ పరిమితిని 20 వేల డాలర్లకు పెంచింది. ఏడాది పాటు పైలట్ ప్రాజెక్టు ఫలితాలను పరిశీలించిన అనంతరం ఈ విధానాన్ని శాశ్వతంగా కొనసాగించేందుకు అమెరికా విదేశాంగ శాఖ నిర్ణయించింది. ఆగస్టు 3నుంచి ఇది అమల్లోకి రానుంది. మొత్తం 50 దేశాల వారికి ఈ బాండ్ విధానం వర్తిస్తుందని అమెరికా తెలి పింది. అయితే, ఈ జాబితాలో భారత్ లేకపోవడంతో ఇండియన్స్‌కు ఉపశమనం దక్కింది. ఈ విధానాన్ని వలసదారుల హక్కుల కార్యకర్తలు, సంస్థలు మాత్రం విమర్శిస్తున్నాయి. బాండ్ భారంగా మారి అర్హులైన వారు అమెరికాకు దూరమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నాయి.

## ఎద్ది కుటుంబానికి పరామర్శల వెల్లువ



- దివంగత నేత చిత్రపటానికి బీఆర్ఎస్ నివాళి

నల్లబెల్లి, ఆగస్టు 2 : ఇటీవల గుండెపోటుతో దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందిన తెలంగాణ ఉద్యమ కెరటం, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రానికి పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. పార్టీ శ్రేణులు వేలాదిగా తరలివస్తూ పెద్ది చిత్రపటం వద్ద నివాళులర్పిస్తూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రతి ఒక్కరూ తమ అధినేతతో ఉన్న సంబంధాలు, ఆయన చేసిన అభివృద్ధి పనులు, కష్టకాలంలో కార్యకర్తలను ఆదుకున్న పరిస్థితులను నెమరు వేసుకుంటున్నారు. పెద్ది కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ అన్న లేకున్నా కోట్లాది మంది హృదయాల్లో చోటు సంపాదించుకున్న అభిమానం అండగా ఉంటుందని భరోసా కల్పిస్తున్నారు. అన్న చూపిన బాటలో పయనిస్తూ బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తామంటూ ప్రతిన బూనుతున్నారు. నర్సంపేట నియోజకవర్గానికి ఐదేళ్లపాటు ఎమ్మెల్యేగా పని చేసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వ అధికారులతో మమేకమైన తీరు, ఆయన ఉద్యోగులకు ఇచ్చిన గౌరవాన్ని బదిలీపై వెళ్లిన వారు అలాగే ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు.

## మాజీ ఎమ్మెల్యే కోసం పోలీసుల గాలింపు

ఏలూరు,ఆగస్ట్1 : గుంటూరు తూర్పు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు ముస్తఫా కోసం ఏలూరు జిల్లా నూజివీడు పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు ఆయన కుమారుడు బషీర్‌పై పలు క్రిమినల్ కేసులు నమోదు కావడంతో ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో వారి వివరాలు తెలిస్తే చెప్పాలని కోరుతూ సోషల్ మీడియా వేదికగా ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. పొగాకు లోడుతో వెళుతున్న వాహనాన్ని బలవంతంగా తీసుకెళ్లడం, బాధితులను డబ్బు కోసం అపహరించడం, కులం పేరుతో దూషించడం వంటి ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, ఆయన కుమారుడు బషీర్‌పై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి ముస్తఫా, బషీర్ పోలీసులకు కనిపించకుండా తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అదే సమయంలో వారి ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమాచారం అందించాలని కోరుతూ నూజివీడు పోలీసులు సోషల్ మీడియాలో ప్రకటన విడుదల చేశారు. ముస్తఫా, బషీర్ వివరాలు తెలిసిన వారు 9154876161, 9154876238 నంబర్లకు సమాచారం అందించి దర్యాప్తునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు హామీ ఇచ్చారు. కాగా, ఈ వ్యవహారం ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.


## ఉర్దూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

- మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్



హైదరాబాద్, ఆగస్టు 02 : ఉర్దూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి అజారుద్దీన్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాంపల్లిలో తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పదో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి అజార్ ముఖ్యఅతిథిగా హాజరై అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉర్దూ భాషాభివృద్ధికి సీఎం, సంబంధిత శాఖల మంత్రులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు ఎంఏ మాజిద్, ప్రధాన కార్యదర్శి ఎస్‌డీ గౌస్ మొహియుద్దీన్ పాల్గొన్నారు.

## ప్రియుడి కోసం..6 నెలల కొడుకుని చంపిన కసాయి తల్లి



హైదరాబాద్, ఆగస్టు 02: ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అమానుష ఘటన వెలుగుచూసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన విశాల్‌తో ప్రేమలో పడిన షబ్నమ్ అనే వివాహిత, తన ఆరు నెలల కుమారుడు సమీర్‌తో కలిసి అతని వద్దకు వెళ్లింది. అయితే చిన్నారిని అంగీకరించబోనని విశాల్ చెప్పడంతో, తమ బంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన షబ్నమ్ అతడిని హత్య చేయడానికి అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం విశాల్‌తో కలిసి చిన్నారిని సమీప డ్రైనేజీలో ముంచి హత్య చేశారు. కుమారుడు కనిపించడం లేదని భర్త ఇమ్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. పోలీసులు షబ్నమ్, విశాల్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సంపాదకీయం

## ఉత్తరాంధ్రకు మణిహారం భోగాపురం !

పోర్టులు, ఎయిర్‌పోర్టులు, సువిశాల సముద్రతీరం కలిగి ఉండడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కలిసి వచ్చే అంశం. రోడ్లు గ్రామాలను అనుసంధానిస్తే, రైల్వేలు పరిశ్రమలను కలుపుతాయి. ఓడరేవులు దేశాల మధ్య వ్యాపారాన్ని విస్తరిస్తే, విమానాశ్రయాలు ప్రపంచ స్థాయి అవకాశాలను ముంగిట్లోకి తీసుకొస్తాయి. నేటి గ్లోబల్ ఎకానమీలో అంతర్జాతీయ స్థాయి ఏవియేషన్ రవాణా వ్యవస్థ ఉంటేనే విదేశీ పెట్టుబడులు, పర్యాటకం, పారిశ్రామిక ఎగుమతులు, రియల్ ఎస్టేట్, ఉద్యోగావకాశాలు విస్తరిస్తాయి. దీంతో అభివృద్ధి వేగంగా సాగడానికి దోహదపడుతుంది. ఎపిలో అనేక సహజ వనరులు ఉన్నప్పటికీ గతంలో నిర్లక్ష్యం చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక అనేక రంగాల్లో అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది. ఓ వైపు భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వచ్చింది. ప్రధాని మోడీ దీనిని ప్రారంభించడం ద్వారా ఉత్తరాంధ్ర కు గేట్‌వేను తెరిచారు. అమరావతలి రాజధాని నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది. అలాగే పోలవరం పూర్తి కావస్తోంది. ఇవన్నీ నిజానికి జగన్ హచయాంలోనే పూర్తి కావాల్సిన ప్రాజక్టులు. కానీ జగన్ నిర్లక్ష్యం కారణంగా వీటిని పక్కన పెట్టారు. మనమెంతకాలం ఉంటామన్నది పక్కన పెట్టి అభివృద్దిలో మనదైన ముద్ర వేస్తే చిరకాలం ప్రజలు గుర్తుంచుకుంటారు. దశాబ్దాలుగా విశాఖపట్నం ఉత్తరాంధ్రకు ఆర్థిక, వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతున్నా, ప్రస్తుతం ఉన్న విశాఖ విమానాశ్రయం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం కాదు. ఇది నావల్ డాక్ వారి విమానాశ్రయం కావడంతో చంద్రబాబు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయా నికి నిర్ణయించారు. విశాఖ పట్టణానికి ఇది దగ్గరగా ఉండడ, ఉత్తరాంధ్రకు కూడా కలసి వచ్చే అంశం. విశ్వాఖ పూర్తిస్తాయి విమానాశ్రయం కాకపోవడంతో ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థలు విశాఖకు తగినన్ని సర్వీసులు నడపలేక పోయాయి. విశాఖపట్నం ఐటీ, ఫార్మా, వైద్యం, విద్య పర్యాటక రంగాల్లో అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా ఎదుగుతున్న వేళ, ఒక పూర్తిస్థాయి పౌర అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం ఏర్పడింది. అందుకే ఎపి విభజన తరవాత చంద్రబాబు భోగాపురం కోసం నిర్ణయించారు. 2014లో విశాఖ సమీపంలోని భోగాపురాన్ని గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి అనువైన ప్రాంతంగా గుర్తించారు. 2019 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కేవలం విమానాశ్రయమే కాకుండా ఏరోసిటీ, విమానాల మరమ్మతులు, పైలట్ శిక్షణ కేంద్రాలతో కూడిన లాజిస్టిక్స్ హబ్‌గా దీనిని డిజైన్ చేశారు. భూసేకరణ చేపట్టి, ఇళు కోల్పోయిన 390 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు ప్రత్యేక కాలనీలు నిర్మించారు. అన్నింటికి మించి రామ్మోహన్ నాయుడును ఎన్‌డిఎలో పౌర విమానయాన శాఖ మంత్రిగా నియించయుకోవడం ద్వారా పనులు చకచకా చేయించుకోగలిగారు. చంద్రబాబు సిఎంగా కొనసాగివుంటే 2019లోనే ఇది పూర్తయ్యేది. దాదాపు 12 ఏళ్ల తరవాత మళ్లీ రెండోదఫా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక భోగాపురం వేగం పుంజుకుని చకచకా పనులు పూర్తి చేసుంది. ఇలా చరిత్రలో 2026 ఆగస్టు 1 నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయడం విశేషం. సాధారణంగా విమానాశ్రయాలు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తాయి. కానీ కొన్ని ప్రాజెక్టులు మాత్రమే ఒక ప్రాంత ఆర్థిక రూపురేఖలను పూర్తిగా మార్చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సరిగ్గా అటువంటి ప్రాజెక్టే!మౌలిక సదుపాయాల కల్పన ఏ ప్రాంత ఆర్థికాభివృద్ధికైనా పునాది వంటిది. ఈ ఆలోచనా సరళితోనే కూటమి ప్రభుత్వం భోగాపురం విమానాశ్రయాన్ని అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దింది. నిజానికి ఇది 2019లోపే పూర్తయి వుంటే పరిస్తితి మరోలా ఉండేది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ మౌలిక వసతుల విప్లవంలో భోగాపురం ప్రాజెక్టు ఒక మచ్చుతునక! జాతీయ రహదారులు, రైల్వేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానం ద్వారా దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే క్రమంలో ఇది మరో చరిత్రాత్మక విజయం. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భోగాపురం అనేది కేవలం ఒక కనెక్టివిటీ మాత్రమే కాదు. ఆత్మవిశ్వాసానికి, సరికొత్త అవకాశాలకు, ఉన్నత ఆశయాలకు సంకేతం. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్‌కు, పారిశ్రామిక ఆవిష్కరణలకు ఉత్తరాంధ్ర ఇప్పుడు చిరునామాగా నిలవనుంది. 2024లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఈ ప్రాజెక్టు మళ్లీ శరవేగంగా పట్టాలెక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించగా, కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రాత్రింబవళ్లు పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.4,700 కోట్ల భారీ వ్యయంతో 2,700 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన భోగాపురం విమానాశ్రయం దేశంలోనే అత్యంత ఆధునిక గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులలో ఒకటి. ఇక్కడ నిర్మించిన 3.8 కిలోమీటర్ల సుదీర్ఘ 'కోడ్ 4ఈ' రన్‌వే ద్వారా భారీ అంతర్జాతీయ విమానాలు కూడా సునాయాసంగా ల్యాండ్ అవుతాయి. ప్రాథమికంగా ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా ఈ టెర్మినల్ రూపుదిద్దుకుంది. ప్రకృతి విపత్తులను సైతం తట్టుకునేలా అత్యున్నత ప్రమాణాలతో దీనిని నిర్మించారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి ర ఆవడంతో ఉత్తరాంధ్రలోని ఫార్మా, సీఫుడ్, పండ్లు, పూలు, వస్త్ర పరిశ్రమల ఎగుమతులకు అవకాశాలు పెరగడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

# గుజరాత్ ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న బాలికల డ్రాపౌట్స్

- ఎస్సీ, ఎస్టీల్లో పరిస్థితి మరింత దారుణం : కేంద్ర ప్రభుత్వం వెల్లడి



**న్యూఢిల్లీ, ఆగస్టు 02 :** గత ఐదేళ్లలో గుజరాత్ ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కింద స్థాయి తరగతుల్లో వీరి సంఖ్య ఎక్కువగానే ఉంటున్నా.. నాలుగో తరగతికి వచ్చేసరికే బాలికల సంఖ్య భారీగా పడిపోతోంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు చెందిన విద్యార్థుల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వమే ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో వెల్లడించడం విశేషం. కొన్ని రోజుల క్రితం లోక్‌సభకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సమర్పించిన నివేదిక ప్రకారం.. గుజరాత్ ప్రభుత్వ పాఠశాలల్లో 5వ తరగతికి వచ్చే సరికి బాలికల స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) గత ఐదేండ్ల క్రితం 95.8 శాతం ఉండగా, ప్రస్తుతం అది 19.3 పాయింట్లు క్షీణించి, 76.5 శాతానికి దిగజారింది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల్లో జీఈఆర్ మరింత దిగజారిందని నివేదిక వెల్లడించింది. షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) లకు చెందిన విద్యార్థులలో దిగువ తరగతుల్లో ఐదేండ్ల క్రితం 87.0 శాతంగా ఉన్న జిఇఆర్ నాలుగో తరగతికి వచ్చే సరికి 67 శాతానికి తగ్గింది. షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ) విద్యార్థుల విషయానికొస్తే 96.6 శాతంగా ఉన్న జిఇఆర్ 70 శాతానికి తగ్గింది. నివేదికలోని వివరాల ప్రకారం గుర్తించవల్సిన ముఖ్యమైన ఏమిటంటే.. బాలికలు, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులందరూ ప్రాథమిక ముందు దశలో అంటే ఫౌండేషన్ దశలో గణనీయమైన నమోదుతో ఆ తర్వాత అంటే మూడు, నాలుగు తరగతుల్లోనే భారీ సంఖ్యలో పాఠశాలలకు దూరం అవుతున్నారు. గుజరాత్‌లో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య పెరుగుతున్నా.. ఈ విధంగా జరుగుతుండటం గమనార్హం. లోక్‌సభకు తెలిపిన కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ లెక్కల ప్రకారం గుజరాత్‌లో 2021-22లో 34,699 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 2025-26 నాటికి 34,734కి పెరిగాయి. అయితే ఎన్ని పాఠశాలలు మూసివేశారు, ఎన్ని విలీనం చేశారు, ఎన్ని కొత్తగా ప్రారంభించారు లేదా పునర్వర్గీకరించబడ్డాయి అనే వివరాలను ఈ డేటా ప్రత్యేకంగా వివరించలేదు. కాబట్టి, గుజరాత్‌లో పాఠశాలల మొత్తం సంఖ్య పెరగడాన్ని చూసి ఈ రాష్ట్రంలో ఎలాంటి మూసివేతలు జరగలేదనడానికి సాక్ష్యంగా భావించలేమని విద్యారంగానికి చెందిన నిపుణులు అంటున్నారు. డ్రాపౌట్స్ భారీగా పెరగడానికి జనాభా వలసలతో పాటు పాఠశాలల మూసివేతలు ప్రధాన కారణాలుగా ఉంటాయని నిపుణులు తెలుపుతున్నారు. కాగా, గుజరాత్‌లో డ్రాపౌట్స్ ఎక్కువగా ఉంటారని కేంద్ర ప్రభుత్వ నివేదికలే వెల్లడిచేయడం ఇదే మొదటిసారి కాదు. గత నెల ప్రారంభంలో విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డిజి) పురోగతి నివేదిక 'గుజరాత్‌లో సగం మంది విద్యార్థులు 12వ తరగతి పూర్తి చేయలేరని' వెల్లడించింది. కళాశాల ప్రవేశాల విషయంలో దేశంలోనే గుజరాత్ 23వ స్థానంలో ఉంది. గుజరాత్‌లో కేవలం 50.82 శాతం మంది విద్యార్థులు మాత్రమే 12వ తరగతి పూర్తి చేస్తున్నారు. ఇది జాతీయ సగటు 61.14 శాతం కంటే గణనీయంగా తక్కువ. అలాగే, జాతీయ స్థాయితో పోలిస్తే భాషా ప్రావీణ్యం, గణిత నైపుణ్యంలో గుజరాత్ విద్యార్థులు చాలా వెనుకబడి ఉన్నారు.

# ఎర్రబస్సు కాదు..ఎయిర్ బస్సులు వాలుతాయ్



- కళ్లు తెరచి చూస్తే అభివృద్ధి కనిపిస్తుంది
- భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవంలో రామ్మోహన్
- ఉత్తరాంధ్ర కలలకు రెక్కలిచ్చారన్న లోకేశ్

**విజయనగరం,ఆగస్ట్2 :** ప్రపంచం మొత్తం ఇప్పుడు ఉత్తరాంధ్ర వైపు చూస్తోందని కేంద్ర విమాన యానశాఖ మంత్రి రామ్మో హన్ నాయుడు అన్నారు. శనివారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్ర మంత్రి రామ్మోహన్ మాట్లాడుతూ... యువతకు ఉద్యోగావకాశాలు పెరగబోతున్నాయన్నారు. ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ సింహద్వారమని చెప్పుకొచ్చారు. ఏపీ అభివృద్ధికి కేంద్రంగా భోగాపురం మారనుందని తెలిపారు. ఎర్రబస్సు కూడా తిరగని ప్రాంతమని కొందరు హేళన చేశారని కేంద్ర మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కళ్లు తెరిచి చూడండి.. ఎయిర్‌బస్సు తిరిగే ప్రాంతమైంది' అని తెలిపారు. ఉత్తరాంధ్రలో ప్రతి ఇంటి పండుగ ఇది అని అన్నారు. మన్యం వీరుడు అల్లూరి పేరు ప్రపంచం మొత్తం మార్మోగుతోందని తెలిపారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే సత్తా ప్రధాని మోదీది అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కొనియాడారు. ప్రపంచం గర్వించదగ్గ నాయకుడు మోదీ. సీఎం చంద్రబాబు నాయకత్వంలో విజన్ 2047, ప్రధాని మోదీ సారథ్యంలో వికసిత్ భారత్ సాధనే లక్ష్యంగా పెట్టుకున్నాం అని రామ్మోహన్ నాయుడు వివరించారు. ఉత్తరాంధ్ర కలలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెక్కలిచ్చారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి నడిచిన ప్రాంతం.. ఉత్తరాంధ్ర. ఈ విమానాశ్రయం ఏపీకి పవర్ ఇంజిన్‌గా మారుతుంది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలకం కాబోతోంది. ఏపీ అభివృద్ధికి మోదీ పూర్తి సహకారం అందిస్తున్నారు. నమో సహకారంతోనే రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సహజవనరులు సమృద్ధిగా ఉన్న ప్రాంతం ఉత్తరాంధ్ర. ఈ ప్రాంతం నుంచి వలసలు తగ్గుతాయి. ఎర్రబస్సు రాదన్నచోట ఎయిర్‌పోర్టు వచ్చింది.. మన ప్రధాని మోదీ వచ్చారు. శరవేగంగా విమానాశ్రయం నిర్మించిన జీఎంఆర్‌కు అభినందనలు' అని లోకేశ్ తెలిపారు.



## గాజులరామారం సూరారంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత.. ఉద్రిక్తత

**హైదరాబాద్, ఆగస్టు 02:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో రెవెన్యూ అధికారులు సోమవారం అక్రమ నిర్మాణాల కూల్చివేత చేపట్టారు. సూరారం సాయినగర్ కాలనీలోని దిల్ సంస్థకు కేటాయించిన సర్వే నంబర్ 49/6 భూముల్లో అక్రమంగా నిర్మించిన పారిశ్రామిక షెడ్లు, దుకాణాలను అధికారులు జేసీబీలతో తొలగించారు.కాగా, కూల్చివేతలను అడ్డుకునేందుకు కొందరు ఆక్రమణదారులు ప్రయత్నించడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు భారీగా మోహరించి, భద్రత నడుమ కూల్చివేతలను కొనసాగించారు.

## పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో ఎల్లంపల్లి



### సందర్శకులను అనుమతించని అధికారులు

**కరీంనగర్,ఆగస్ట్ 2 :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో హాజీపూర్ మండలంలోని గుడిపేట సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు అందాలను వీక్షించి ఆనందించాలనుకునే సందర్శకులకు మాత్రం నిరాశే ఎదురవుతోంది. గేట్ల ఎత్తివేత నేపథ్యంలో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వెళ్లే మార్గంలో గుడిపేట చేపల మార్కెట్ వద్ద పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి ఎవరినీ అనుమతించడంలేదు. దీంతో ప్రాజెక్టు చూసేందుకు వచ్చిన సందర్శకులు అసహనంతో వెనుదిరిగిపోతున్నారు. దీంతో స్థానికులు పర్యాటకులు పోలీసులు, నీటిపారుదల శాఖల తీరుపై మండిపడుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం అనంతరం అవతలి వైపున ఉన్న పెద్దపల్లి జిల్లాకు చిన్న వాహనాల రాక పోకలకు అనుమతులు ఇవ్వడంతో ఈ మార్గం ద్వారా ప్రతి రోజు వందలాది మంది ప్రయాణిస్తున్నారు. రామగుండంలోని ఎన్టీపీసీకి విధులకు హాజరయ్యే ఉద్యోగులు కూడా ఈ మార్గాన్నే ఎక్కువగా వినిగియోస్తుంటారు. పెద్దపల్లి జల్లాలో పనిచేసే కూలీలు, ఇతర కార్మికులు సైతం నిత్యం ఈ ప్రాజెక్టు మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. పాలవ్యాపారులు కూడా ప్రతిరోజు పదుల సంఖ్యలో మంచిర్యాల జల్లా కేంద్రానికి ఈమార్గం ద్వారానే వెళ్తుంటారు. ప్రస్తుతం ప్రాజెక్టు పైకి వెళ్లేందుకు ఆంక్షలు విధించడంతో వీరంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# క్షమాపణలు కాదు... కేసుల ఎత్తివేతపై మాట్లాడండి

- ప్రధాని మోడీ క్షమాపణలపై అభిజిత్ దీప్కే ప్రశ్నలు



**న్యూఢిల్లీ,ఆగస్ట్ 2 :** విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రీల్‌లో మాత్రమే క్షమిస్తారా? లేక విద్యార్థులపై నమోదైన కేసుల ను కూడా ఉపసంహరించుకుంటారా?' అంటూ ఆయన సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మం తర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో, కొందరు ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై ప్రధాని స్పందిస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేశారు. తనను, తన తల్లిని దూషించిన వారిని తాను క్షమిస్తున్నానని, వారిని శిక్షించడం కంటే సరైన మార్గంలో నడిపించడం సమాజ బాధ్యత అని ఆయన పేర్కొ న్నారు. వీడియోపై స్పందించిన అభిజీత్ దిప్కే, 'క్షమించామని చెప్పడం సరిపోదు. విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఎత్తివేస్తారా?' అని ప్రశ్నించారు. అలాగే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఒక కెమెరామెన్‌పై అనుచిత పదజాలం ఉపయోగించిన వీడి యోను ప్రస్తావిస్తూ, 'ఈ దేశంలో రెండు రకాల చట్టాలా? యువతకు ఒకటి, అధికార పార్టీకి మరొకటా?' అని విమర్శించారు. కాగా, ప్రధానమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆరోపణలతో నోయిడాకు చెందిన ఓ బాలికపై కేసు నమోదైంది (ఏజీనిబిజీస ఓజీనిబిజీస ÷ఔసనీబిఱబబి). తాజాగా ఆమె వీడియో విడుదల చేసి దేశ ప్రజలకు, ప్రధానమంత్రికి క్షమాపణలు చెప్పింది. తాను చేసిన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. కాగా, నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# ఈ యేడు తిరుమలలో రెండు బ్రహ్మోత్సవాలు

### సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో వరుసగా నిర్వహణ

**తిరుమల,ఆగస్ట్ 2 :** తిరుమలలో ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో పరవశింప చేయను న్నాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించ నున్నారు. సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాను న్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు వాహన సేవలు ఉంటాయి. ఈ మేరకు టిటిడి భారీగా ఏర్పాట్లు చేస్తోంది. సెప్టెంబర్ 15న సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి 9 గంటలకు పెద్ద శేష వాహనం ఉంటుంది. 16న ఉదయం 8 గంటలకు చిన్న శేష వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటలకు హంస వాహనం ఉంటుంది. 17న ఉదయం 8 గంటలకు సింహ వాహనం, రాత్రి 7 గంటలకు ముత్యపు పందిరి వాహనం నిర్వహిస్తారు. 18న ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనం, రాత్రి 7 గంటలకు సర్వ భూపాల వాహనం, 19న ఉదయం 8 గంటలకు మోహినీ అవతారం, సాయంత్రం 6:30 నుంచి రాత్రి 11:30 గంటల వరకు గరుడ వాహనం నిర్వహిస్తారు. 20న ఉదయం 8 గంటలకు హనుమంత వాహనం, సాయంత్రం 4 గంటలకు స్వర్ణ రథం, రాత్రి 7 గంటలకు గజ వాహనం నిర్వహిస్తారు. 21న ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటలకు చందప్రభ వాహనం, 22న ఉదయం 7 గంటలకు రథోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వ వాహనం, 23న ఉదయం 6 నుంచి 9 వరకు చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల్లో సిఫారసు లేఖలను అనుమతించరు.